క్లుప్తంగా

రేపు ఎటపాక మండల పరిషత్ సమావేశం

ఎటపాక: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 26న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ బుధవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

చింతపల్లి: చింతపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు.మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, అన్ని పంచాయితీలు సర్పంచ్‌లు,ఎంపీటీసీ, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నెలాఖరుకు శతశాతం ఈక్రాప్ నమోదు


మాట్లాడుతున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి: మండలంలో ఈ నెలాఖరు నాటికి రైతులతో శతశాతం ఈ క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అసిస్టెంట్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ 52 శాతం ఈ క్రాప్ నమోదు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో సాగులో ఉన్న పంటలకు సంబంధించి ఎప్పటికప్పుడు రైతులకు తగిన సూచనలు అందించాలన్నారు.

వనరుల సద్వినియోగంతో పంచాయతీల అభివృద్ధి

- ఎంపీడీవో బాల మురళీకృష్ణ

కొయ్యూరు: వనరులను సద్వినియోగం చేయడం ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేయవచ్చని ఎంపీడీవో బాల మురళీ కృష్ణ అన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులతో గ్రామాల అభివృద్ధిపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాధాన్యత పరంగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సర్పంచ్‌లు,కార్యదర్శులు కలిసి సంయుక్తంగా పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు.

230 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


లబ్బర్తి లో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తిలో బుధవారం 230 తెల్ల, నల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు డాక్టర్ తరుణ్ తెలిపారు. గురు, శుక్రవారాల్లో కింద్ర, కింద్ర పరిసర ప్రాంతాల్లో పశువులకు టీకాలు వేయనున్నట్టు ఆయన చెప్పారు. మండలానికి 12వేల డోసుల వ్యాక్సిన్ వచ్చిందని, ఇప్పటి వరకు సుమారు 3,600 పశువులకు టీకాలు వేశామన్నారు. సిబ్బంది వెంకట్, వెంకటేష్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

ఆదికర్మయోగి సేవా కేంద్రం ప్రారంభం


సేవా కేంద్రంలో మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్‌బాబు, ఎంపీటీసీ వంశీ కుంజం

రంపచోడవరం: మండలంలోని బోర్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆదికర్మయోగి సేవా కేంద్రాన్ని బుధవారం ముసురుమిల్లి సర్పంచ్ కోసు రమేష్ బాబు, ఎంపీటీసీ వంశీ కుంజం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా సచివాలయ ఉద్యోగి గ్రామానికి పలు సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు సరస్వతి, మాజీ సర్పంచ్ గుర్రేటి లక్ష్మి, కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు

అరకులోయటౌన్: అరకులోయ-పాడేరు ప్రధాన రహదారిలోని ఎండపల్లివలస, అరకు సంత బయలు మధ్యలో బురద గెడ్డ వద్ద వంతెన నిర్మాణానికి కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ రూ. 10 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీడీవో అడప లవరాజు తెలిపారు. గెడ్డపై గల వంతెన శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారింది. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన కలెక్టర్ నిధులు మంజూరు చేశారన్నారు. పాడేరు ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందరం బాబు వంతెన పరిశీలించినట్టు చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పడితే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ప్రయాణం.. భయం భయం

- పాడైన రహదారులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, జోలాపుట్టు మార్గంలో తరుచూ ప్రమాదాలు


సుజనపేట మార్గంలో కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ముంచంగిపుట్టు: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గంలో మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.వాహనచోదకులు భయం భయంగా ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో గుమ్మఘాట్‌లో ప్రధాన మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడం ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇదే మార్గంలో పోతురాజుపుట్టు,పనసపుట్టు,బొంద్రుగూడ గ్రామాల సమీపంలో మలుపుల వద్ద సైతం హెచ్చరిక బోర్డులు లేవు. రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో పాటు ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో లుంగాపుట్టు, కిలగాడ ఘాట్, రంగన్నకొండలలో మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ సైతం చేయకపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంతో మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గంలో కించాయిపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టు వద్ద వర్షాలకు రహదారి కోతకు గురై ప్రమాద భరితంగా ఉంది. మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే మళ్లీ రహదారి కోతకు గురైంది.మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట ఆర్‌అండ్‌బీ రోడ్డులో కల్వర్టు కుంగిపోయి ఏడాదిపైగా అవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం దృష్టి పెట్టలేదు. దీంతో అటుగా రాకపోకలు చేసే వాహనచోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని,గుమ్మసిరగంపుట్టు,సుజనపేట వద్ద కోతకు గురైన రహదారి,కుంగిపోయిన కల్వర్టును బాగు చేయాలని కోరుతున్నారు.


గుమ్మసిరగంపుట్టు వద్ద ప్రమాదభరితంగా ఉన్న రహదారి


హెచ్చరిక బోర్డు లేని అత్యంత ప్రమాదకరమైన గుమ్మఘాట్ మలుపు


నిత్యం ప్రమాదాలు జరిగే కిలగాడ ఘాట్ మలుపు

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే రోడ్డులో తుప్పలు పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలి.అలాగే గుమ్మఘాట్ మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి.

– గొల్లోరి రాంబాబు, వాహనదారుడు, ముంచంగిపుట్టు

కల్వర్టు కుంగిపోయి ఏడాదైనా..

సుజనపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో కల్వర్టు కుంగిపోయి ఏడాది పైగా అవుతున్న నేటికీ మరమ్మతులు చేయలేదు. పెద్ద గొయ్యి ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.రోజు రోజుకు గొయ్యి పెద్దదవుతోంది. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి.

– వెంగడ రమేష్, సర్పంచ్, సుజనకోట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

కల్వర్టును త్వరలో బాగుచేస్తాం

సుజనపేట మార్గంలో కోతకు గురైన కల్వర్టుకు త్వరలో మరమ్మతులు చేస్తాం. కొన్ని మార్గాల్లో ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ చేశాం. కొన్ని మలుపులు వద్ద హెచ్చరికబోర్డులున్నాయి. మిగతా వాటి వద్ద కూడా ఏర్పాటు చేస్తాం.

– శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ముంచంగిపుట్టు

'ధర్మయుద్ధం' సభను విజయవంతం చేయాలి


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎటపాక: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న భద్రాచలంలో నిర్వహించే ధర్మయుద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం సభ వాల్‌పోస్టర్‌ను ఎటపాకలో ఆవిష్కరించి మాట్లాడారు. ఆంధ్ర,తెలంగాణాలలో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.1976లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం చట్టబద్ధత లేకుండా లంబాడీలను ఎస్టీలుగా గుర్తించిందని విమర్శించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్,టాప్‌టెన్ టీం ఆధ్వర్యంలో చేపట్టిన ఆదివాసీ ధర్మయుద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బాడిశ వెంకటేశ్వర్లు, కోటేశ్వరావు,అర్జున్,లక్ష్మణ్,మల్లు,చలపతి,జోగయ్య,వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో మూడు సీట్లు ఖాళీ

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ భూరా రామ్ భైరవ తెలిపారు. ఈఏడాది ఏకలవ్య ప్రవేశ పరీక్ష రాసిన బాలురతో ఈ ఖాళీలను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు స్కోర్, ఆధార్ కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో హాజరుకావాలన్నారు. ఎవరు ముందుగా వస్తే వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు.

కూనవరం పంచాయతీ రికార్డుల తనిఖీ


విలేకరులలతో మాట్లాడుతున్న అధికారులు

కూనవరం: స్థానిక గ్రామ పంచాయతీ నిధుల నియోగంలో అవినీతి జరిగినట్లు, పనులు చేయకుండా చేసినట్టు పేర్కొన్నారని అభియోగాలు రావడంతో డీడీవో కోటేశ్వరరావు, ఏవో సుబ్బారావు బుధవారం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 2022 నుంచి 2025 నిధుల వినియోగంలో అవినీతి జరిగిందని వచ్చిన అభియోగాల మేరకు పంచాయతీ రికార్డులను తనిఖీ చేసినట్టు చెప్పారు. ఆ రికార్డులను డివిజన్ కార్యాలయానికి తరలించినట్టు వారు తెలిపారు. 2023-2024 వరకు ఆడిట్ జరిగిందని, 2024-2025 ఆడిట్ జరగాల్సి ఉందన్నారు. పనులు చేయకుండా చేసినట్టు పేర్కొన్నారని వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. గిరిజనేతరుడు సర్పంచ్‌గా కొనసాగడంపై పూర్తి క్లారిటీ ఇచ్చామన్నారు. పంచాయతీ రాజ్, ఎన్నికల నియమావళి ప్రకారం స్థానిక పంచాయతీలో గిరిజన సర్పంచ్ మృతి చెందడంతో గిరిజ నేతరుడైన ఉప సర్పంచ్‌నే కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్‌గా కొనసాగుతున్నట్లు తెలిపారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు.



నగదు రికవరీ చేయాలని మహిళల ఆందోళన


ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చింతూరు: రుణాల మంజూరులో జరిగిన అవకతవకలకు సంబంధించిన నగదును సంబంధిత ఉద్యోగుల నుంచి రికవరీ చేసి తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని ఎర్రంపేటకు చెందిన గ్రామసమాఖ్య మహిళలు బుధవారం స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గతంలో తమకు తెలియకుండానే స్త్రీనిధి ద్వారా తమ పేర్లతో అప్పటి వెలుగు సిబ్బంది రుణాలు తీసుకుని సొంతానికి వాడుకున్నారని, అనంతరం ఆ నగదు చెల్లించాలంటూ బ్యాంకులు నోటీసులు పంపడంతో ఆందోళనకు గురయ్యామని తెలిపారు. సుమారు 30 గ్రూపులకు సంబంధించి రూ.30 లక్షలకు పైగా స్వాహా అయ్యాయని, దీనిపై అప్పటి పీవోకు తాము ఫిర్యాదు చేయడంతో , విచారణ నిర్వహించగా అవకతవకలు వాస్తవమేనని తేలిందని వారు తెలిపారు. కాగా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకున్న అధికారులు వారి వద్దనుంచి నగదు రికవరీ చేయలేదని తెలిపారు. దీంతో బ్యాంకులు తమకు స్త్రీనిధితో పాటు వ్యక్తిగత రుణాలు కూడా ఇవ్వక తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోయారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ వారితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. దీనిపై అధికారులతో చర్చించి తిరిగి విచారణ నిర్వహించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయిస్తానని వారికి హామీనిచ్చారు. సర్పంచ్ కారం కన్నారావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


చింతపల్లిలో దుర్గమ్మను పూజిస్తున్న భక్తులు


జి.మాడుగులలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు

చింతపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. స్థానిక రంగా సెంటర్,అనాదీశ్వర ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువైన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జి.మాడుగుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి మహిళా భక్తులు వెండి పుస్తెలతాడును అలంకరించారు. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో దుర్గమ్మకు వెండి పుస్తెలను అలంకరించడం ఆనవాయితీగా వస్తోందని వారు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం


రామాలయంలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సుభాష్‌చంద్ర, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: స్థానిక రామాలయం వీధిలో జెడ్పీ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి.స్థానిక సర్పంచ్ సుభాష్‌చంద్ర,వైస్‌ఎంపీపీ సత్యనారాయణ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రామాలయం వీధిలో రోడ్డు సమస్యను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి 100 మీటర్ల సీసీ రోడ్డు మంజూరు చేశారని, దీంతో కాలనీ వాసుల కష్టాలు తీరుతాయని సర్పంచ్,వైస్‌ఎంపీపీ,రామాలయం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేసి,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేతలు సన్యాసిరావు, పాపారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ


మంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బాలరాజు, భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: స్థానిక రామకోవెల వీధిలో నివసిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మత్స్యరాస మత్స్య రాజు మాతృమూర్తి,పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గాయత్రి, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి అత్త మత్స్యరాస మంగమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు.మంగమ్మ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు,జిల్లా ఆస్పత్రి వైస్ సూపరింటెండెంట్ డాక్టర్ తమర్బ నరసింగరావు,ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, టీడీపీ నాయకులు వంజరి చిరంజీవినాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


వాకపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వరప్రసాద్

జి.మాడుగుల: సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి కె.వరప్రసాద్ తెలిపారు. సుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ శాఖాధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాజ్‌మా విత్తన శుద్ధి గురించి వివరించారు. వరి పంటకు నానో యూరియా వినియోగించాలని సూచించారు. వరిలో ఆకు ముడత పురుగు అక్కడక్కడ కనిపిస్తోందని, దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్పీ పౌడర్‌ను వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది సత్యనారాయణ, ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదబయలు: మండలంలోని నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో ప్రవంతి తెలిపారు. అరడకోట పంచాయతీ బొంగదారి, కుంతర్ల పంచాయతీ పెద్దపాడు,ఇంజరి పంచాయతీ గూనలోవ,తగ్గుపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. దరఖాస్తు చేసే మహిళల వయస్సు 21 సంవత్సరాల నుంచి 35 లోపు ఉండాలని, అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తును పెదబయలు సీడీపీవోకార్యాలయానికి అందించాలని తెలిపారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రంపచోడవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీవో డి.ఎన్.వి.రమణ తెలిపారు. ఆధార్ సెంటర్‌ను ఏపీవో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవో స్మరణ్‌రాజ్ ఆదేశాల మేరకు ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డేవిడ్, పీఎంయూ అధికారులు చంద్రకళ, మోహన్,సంధ్య, ఎస్‌ఐ షరీఫ్, డిప్యూటీ ఎంపీడీవో రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి


చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ వద్ద ఆవేదన వ్యక్తంచేస్తున్న వలంటీర్లు

చింతూరు: వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని మండల వలంటీర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వలంటీర్లను కొనసాగించడంతో పాటు వేతనాలు పెంచుతామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. హామీలో భాగంగా బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల యూనియన్ డివిజన్ అధ్యక్షుడు పొడియం జానీ, భూక్యా వినోద్ కుమార్, కలుముల మహేష్, సోడె దుర్గారావు, రామిరెడ్డి, రాజు, సింగయ్య, శాంతి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య సేవలు


కడుతులలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి శ్యాంప్రసాద్


బందవీధిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కిశోర్

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియన్ కార్యక్రమంలో లబ్బూరు సీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో 108 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ కాసులమ్మ,ఏఎన్ఎం పుష్పవతి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కె.కోడాపల్లి సచివాలయం పరిధి బందవీధిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. వ్యాధులు, వైద్య సేవలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ, హెచ్‌వీ మేనక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

29న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఆందోళన


వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న పల్లపు వెంకట్

చింతూరు: ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఈనెల 29న ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తెలిపారు. బుధవారం చింతూరులో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన హాస్టళ్లలో పని చేస్తున్న వర్కర్ల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. 12 నుంచి 14 గంటలు శ్రమ చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, మృతిచెందిన వర్కర్ల స్థానంలో కొత్త వర్కర్ల నియామకం చేపట్టకపోవడంతో పనిఒత్తిడి పెరిగి అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 29న రంపచోడవరంలో జరిగే ఆందోళనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు దుర్గారావు, వీరయ్య, చంద్రమ్మ, పుల్లమ్మ, ముత్తమ్మ, రమాదేవి, రాంబాబు పాల్గొన్నారు.

సీమనేరోడి గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలి

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ సీమనేరోడి గ్రామానికి తారురోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకుడు బాబుజీ కోరారు. బుధవారం ఆయన గ్రామానికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిండలం గ్రామం వరకు తారురోడ్డు సదుపాయం ఉందని అక్కడ నుంచి రెండు కిలో మీటర్లు రోడ్డు సదుపాయం లేదన్నారు. దీంతో అత్యవసర పరిస్థితిలో రోగులను డోలీలో ఆస్పత్రికి తీసుకువెళ్లవలసి వస్తోందని చెప్పారు. అధికారులు స్పందించి రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని బాబూజీ, గ్రామస్తులు కోరారు.